
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.4 కనిష్ఠం 20.8
కామారెడ్డి జిల్లా వార్తలు
5
ఆదివారం 3 మార్చి 2024




విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన నలుగురిపై వేటు

సదాశివనగర్, మార్చి 2: సదాశివనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్ష నిర్వహణలో విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్నందుకు నలుగురిని సస్పెండ్ చేసినట్లు ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్‌సలాం తెలిపారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన హిందీ లెక్చరర్ ఇశ్రాత్, కెమిస్ట్రీ లెక్చరర్ రంజిత్‌లతో పాటు డీవో రాజా గౌడ్, పర్యవేక్షణ అధికారిగా పని చేస్తున్న ప్రసాద్ కిరణ్‌లను సస్పెండ్ చేసినట్లు తెలిపారు.



అభ్యర్థుల కోసం.. అన్వేషణ



- కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల కోసం అన్వేషణ
- ఎంపీ టికెట్‌పై పార్టీల వ్యూహాలు
- జహీరాబాద్ టికెట్‌కు పోటాపోటీ ప్రయత్నాలు
- కాంగ్రెస్‌లో ఇద్దరి మధ్య పోటీ
- బీఆర్ఎస్‌లో భాస్కర్‌రెడ్డికి లైన్ క్లియర్ అయినట్టేనా?
- మూడోసారి జహీరాబాద్ బరిలో ఉండనున్న బీబీ పాటిల్
- బీజేపీలో చేరిన రెండ్రోజుల్లోనే టికెట్ కేటాయించిన అధిష్ఠానం

కామారెడ్డి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో ఎట్టకేలకు బీజేపీ అధిష్ఠానం మొదటి జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో రాష్ట్రంలోని 9 మంది అభ్యర్థులను బీజేపీ ప్రకటించింది. అయితే రెండ్రోజుల క్రితం బీజేపీలో చేరిన బీఆర్ఎస్ ఎంపీ బీబీ పాటిల్‌కు జహీరాబాద్ టికెట్‌ను కేటాయించడం గమనార్హం. ఎంపీ బీబీ పాటిల్‌కు బీజేపీ టికెట్ కేటాయించడంతో జిల్లా పార్టీ శ్రేణుల్లోనే కాకుండా ఆశావహులను ఆశ్చర్యపరిచింది. జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి ఈ సారి తమకే టికెట్ అంటూ సుమారు 20 మంది పోటీ పడడమే కాకుండా పోటాపోటీగా పలు కార్యక్రమాలు చేపడుతూ వచ్చారు. వారి ఆశలన్నింటిని బీజేపీ అధిష్ఠానం ఎంపీ పాటిల్‌కు టికెట్ కేటాయించడంతో వారిని నిరుత్సాహ పరిచినట్లు అయింది. రెండ్రోజుల్లోనే పార్టీ మారిన వ్యక్తికి టికెట్ ఇవ్వడంపై పలువురు ఆశావహులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మొదటి జాబితాలోనే పాటిల్‌కు టికెట్ కేటాయించడం ఆయన అనుచర వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎట్టకే లకు జహీరాబాద్ ఎంపీ టికెట్‌ను బీజేపీ ప్రకటించగా మిగితా కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు అభ్యర్థులకై అన్వేషణ కొనసాగుతుంది. కాంగ్రెస్ సైతం ఈ వారంలో అభ్యర్థిని ప్రకటించనున్నట్లు తెలుస్తోంది.

మూడో సారి బరిలో ఉండనున్న పాటిల్

లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్ మూడోసారి బరిలో ఉండనున్నారు. కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్ మండలం సిర్పూర్ గ్రామానికి చెందిన బీబీ పాటిల్ 2014 సాదారణ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ నుంచి బరిలో దిగి మొదటిసారిగా ఎంపీగా గెలుపొందారు. 2018లోనూ టీఆర్ఎస్ పార్టీ తరపున మరోసారి నిలిచి కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావుపై స్వల్పఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అయితే రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడంతో రాజకీయ పరిణామాలు వేగంగా మారా యి. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోనూ బీఆర్ఎస్‌కు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే గెలుపొందారు. వారి నుంచి ఎంపీ పాటిల్‌కు సహకారం అందే పరిస్థితి లేదని మాజీ ఎమ్మెల్యేలు సైతం పార్లమెంట్ ఎన్నికల్లో సపోర్టు చేయలేరని భావించి బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. జహీరాబాద్ ఎంపీ టికెట్ తనకు ఇస్తే పార్టీలో చేరుతానని బీజేపీ అధిష్ఠానంతో మంతనాలు జరపడంతో టికెట్‌కు హామీ ఇచ్చినట్లు తెలిసింది. రెండ్రోజుల్లో పార్టీ మారిన వెంటనే పాటిల్‌కు మొదటి జాబితాలోనే బీజేపీ టికెట్ కేటాయించడం ఆ పార్టీ వర్గాల్లోనూ ఆశ్చర్యానికి గురి చేసింది.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో అభ్యర్థుల కోసం అన్వేషణ

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసేందుకు ఆశావహులు బారులు తీరుతున్నారు. ఆయా రాజకీయ పార్టీలో టికెట్ ఆశిస్తున్నవారు గత కొద్ది రోజులుగా ఎవరికి వారే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల నిర్వహణ కోసం షెడ్యూల్ విడుదలకు కేంద్ర ఎన్నికల సంఘం సమాయత్తం అవుతోంది. ఈ తరుణంలో బీజేపీ అభ్యర్థిని ప్రకటించగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు సైతం తమ అభ్యర్థుల ఎంపిక కోసం అన్వేషిస్తున్నాయి. ఈ క్రమంలో జిల్లాకు సంబంధించి లోక్‌సభ స్థానానికి ఆ రెండు పార్టీలో నాయకులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఎవరికి వారు తమకు తెలిసిన వారితో లాబీయింగ్ చేసుకుంటున్నారు. జిల్లా పరిధిలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ పరిధిలో ప్రజలు నాయకులతో పర్యటనలు చేస్తున్నారు. తమ బలం ప్రదర్శించు కునే పనిలో ఉన్నారు.

కాంగ్రెస్‌లో ఇద్దరి మధ్య పోటీ

పదేళ్ల తర్వాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఫలితాలతో ఉత్సాహంగా ఉంది. లోకసభ నియోజకవర్గ పరిధిలో ఏడింటిలో నాలుగు స్థానాల్లో గెలువడంతో పార్టీకి ప్రజల్లో సానుకూలత ఏర్పడింది. దీంతో జహీరాబాద్ నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసేందుకు పలువురు కాంగ్రెస్ నేతలు సిద్ధమవుతు న్నారు. కానీ ఇద్దరి మధ్యనే ఎంపీ టికెట్‌కై పోటీ ఉన్నట్లు తెలుస్తోంది. జహీరాబాద్ మాజీ ఎంపీ సురేష్‌షెట్కార్, ఎన్ఆర్ఐ ఉజ్వల్‌రెడ్డి టికెట్‌కై పోటీ పడుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ ఎంపీ సురేష్‌షెట్కార్‌కు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి పార్టీ ఉప సంహరింపజేసింది. జహీరాబాద్ ఎంపీ టికెట్ ఇస్తారని షెట్కార్‌కు హామీ ఇచ్చి నట్లు సమాచారం. షెట్కార్ తో పాటు ఉజ్వల్‌రెడ్డి సైతం టికెట్ ఆశిస్తు న్నారు. స్థానిక నాయకులతో పాటు గాంధీభవన్, ఏఐసీసీ పెద్దలను కలుస్తూ టికెట్ కోసం ఆశావహులు మంత్రాంగం నడిపిస్తున్నారు. పార్టీ అభ్యర్థి ఎంపిక కోసం పలు విధాలుగా కసరత్తు మొదలుపెట్టింది. సామాజిక వర్గం ఆర్థిక, అంగబలంతో పాటు సర్వేలో వ్యక్తిగత ఇమేజిని లెక్కలోకి తీసుకుని కేటాయించే అవకాశం ఉందని నాయకులు చెబుతున్నారు. సామాజిక వర్గాల వారీగా తమ బలాలను ప్రదర్శిస్తున్నారు. ఓటు బ్యాంకుతో పాటు తమ ప్రొఫైల్‌ను అధిష్ఠానానికి పంపిస్తూ తా... ఆశావహుల్లో ఉన్నామని సంకేతాలు ఇస్తున్నారు. వీరిద్దరిలో ఎవరిది పై చేయి అవుతుందో తేలాల్సి ఉంది.

భాస్కర్‌రెడ్డికి లైన్ క్లియర్ అయినట్టేనా?

జహీరాబాద్ సిట్టింగ్ ఎంపీ బీఆర్ఎస్ నేత బీబీ పాటిల్ ఆ పార్టీకి రాజీనామా చేసి రెండ్రోజుల క్రితం బీఆర్ఎస్‌లో చేరారు. దీంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డికి ఎంపీ టికెట్‌కు లైన్ క్లియర్ అయినట్టేనని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. గత 10 ఏళ్ల వైభవంగా ఓ వెలుగు వెలిగిన బీఆర్ ఎస్ పార్టీకి ప్రస్తుతం గడ్డుకాలం ఎదురవడంతో పార్టీలో పోటీ చేసేందుకు ఆశావహులు కాంగ్రెస్, బీజేపీ కంటే తక్కువగా ఉన్నారు. అయితే ఈ పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ నుంచి ఎంపీ టికెట్‌కై తాను రేసులో ఉన్నానంటూ ఇది వరకే పోచారం భాస్కర్ రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. అంతేకాకుండా కామారెడ్డి నియోజకవర్గానికి చెందిన సుభాష్‌రెడ్డి సైతం గతంలో టికెట్ ఆశించారు. ప్రస్తుతం సుభాష్ రెడ్డి స్తబ్దుగా ఉంటూ వస్తున్నారు. సిట్టింగ్ ఎంపీ పార్టీ మార డంతో బీఆర్ఎస్ కొత్త పేరు తెరపైకి తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. బాన్సువాడ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డికి సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉండడం, తన తనయుడైన భాస్కర్ రెడ్డిని బరిలో దింపితే ఇతర పార్టీలకు గట్టి పోటీనిచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో స్థానికంగా నాయకత్వలేమితో బీఆర్ఎస్‌లో ఉత్సాహం కరువైంది. ఈ క్రమంలో భాస్కర్‌రెడ్డి పోటీలో ఉంటారా ఇంకెవరైన వస్తారా అనేదానిపై తేలాల్సి ఉంది.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

నిండు జీవితానికి రెండు చుక్కలు

- నేటి నుంచి మూడు రోజుల పాటు పల్స్ పోలియో కార్యక్రమం
- జిల్లాలో మొత్తం 1,02,555 మంది చిన్నారులకు వేయనున్న పోలియో చుక్కలు

కామారెడ్డి టౌన్, మార్చి 2: నిండు జీవితానికి రెండు చుక్కలు.. అనే నినాదంతో చిన్నారుల బంగారు భవిష్యత్తు కోసం వారిని అంగవైకల్యం నుంచి కాపాడడమే కాకుండా పోలియో రహిత సమాజం నిర్మించడం కోసం కేంద్ర ప్రభుత్వం పల్స్‌పోలియో కార్యక్రమం చేపట్టింది. ఈ వ్యాధి పోలియో అనే వైరస్ వల్ల వ్యాప్తిచెంది నాడి వ్యవస్థను దెబ్బతిసి కండరాలు బలం కోల్పోయే స్థితికి తీసుకువస్తుంది. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండే చిన్నారులకు ఈ వ్యాధి ఎక్కువగా సంక్రమించడమే కాకుండా తీవ్రమైన దుష్ఫలితాలను చూపిస్తాయి. అందుకే అప్పుడే పుట్టిన శిశువు మొదలుకొని ఐదేళ్లలోపు చిన్నారులందరికి పోలియో చుక్కలు వేయిస్తే అంగవైకల్యం నుంచి వారిని రక్షించినవారవుతారు. శనివారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్ జిల్లా ఆసుపత్రి నుంచి జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభించారు.

పోలియో వ్యాధి వ్యాప్తి-లక్షణాలు

అపరిశుభ్రమైన పరిసరాల్లో ఆటలు ఆడుతూ కాళ్లు, చేతులు శుభ్రం చేసుకోకుండా ఆహారాన్ని భుజించే పిల్లలకు సాధారణంగా ఈ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అలా వ్యాప్తి చెందిన వైరస్ క్రింలు, రోగి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు లేదంటే, రోగి మలంలో ఎక్కువగా బహిర్గతం అవుతాయి అలా మలం మీద వాలిన ఈగలు ఆహార పదార్థాల మీద వాలడం ఆ ఆహార పదార్థాలను తిన్న ఆరోగ్యవంతమైన చిన్నారుల కడుపులో ప్రవేశించి వ్యాధిని కలిగిస్తాయి. కడుపులో గాని, గొంతులో గాని ఈ వ్యాధి క్రిములు ఒకసారి ప్రవేశించి అధిక సంఖ్యలో వృద్ధి చెందుతూ క్రమంగా వ్యాధి ముదురుతుంది. అధిక సంఖ్యలో ఉత్పత్తి అయిన క్రిములు రక్తంలో కలిసి నరాలను జీవకణాలను ప్రభావితం చేస్తాయి. అందువల్ల నాడీ మండలం దెబ్బతిని కదల్చడానికి వీలులేకుండా కండరాలు బిగుసుకుపోతాయి.

వ్యాధి వృద్ధి చెందకుండా ఉండడానికే పల్స్ పోలియో కార్యక్రమం

పోలియో వ్యాధి ఎక్కువగా చిన్నారులకు సోకుతుండడంతో వారితో పాటు చుట్టు పక్కల పిల్లలకు వ్యాప్తి చెందకుండా ఉండడానికే కేంద్ర ప్రభుత్వం ఈ పల్స్ పోలియో కార్యక్రమం చేపట్టింది. అందులో భాగంగానే జిల్లాలో ఈ నెల 3, 4, 5 తేదీల్లో నిర్వహించి 0-5 సంవత్సరాల పిల్లలకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పోలియో చుక్కలు వేయనున్నారు. మొదటి రోజు నిర్దేశించిన బూత్‌లలో పోలియో చుక్కలు వేస్తారు. రెండో రోజు, మూడో రోజు సిబ్బంది ఇంటింటికి మార్కింగ్ చేస్తూ పోలియో చుక్కలు వేయించని చిన్నారులకు ఇంటి వద్దే పోలియో చుక్కలు వేయనున్నారు. అందుకుగాను జిల్లాలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. జిల్లాలో మొత్తం 1,02,555 మంది 0-5 సంవత్సరాల చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు అధికారులు నిర్ధేశించారు. 64 రూట్లలో 638 పోలియో బూత్‌లు, 22 బస్టాండ్, రైల్వేస్టేషన్‌లలో ఏర్పాట్లు చేశారు. సంచార జాతులు ఊరి బయట నివసించే వారి కోసం 22 మొబైల్ బృందాల ద్వారా పోలియో చుక్కలు వేయనున్నారు. యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధుల సహకారంతో పల్స్‌పోలియో కార్యక్రమం కొనసాగించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అంతేకాకుండా హైరిస్క్ పాయింట్లను 174 గుర్తించారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలియో చుక్కల కార్యక్రమం కొనసాగుతోంది. జిల్లాలో 2,552 మంది సిబ్బంది పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొననున్నారు. వైద్యఆరోగ్యశాఖ, విద్యాశాఖ, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. రెవెన్యూ డివిజన్లలో ఆర్డీవోలు, మున్సిపల్ పరిధిలో కమిషనర్లు, ఇతర శాఖల అధికారులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించనున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యనభ్యసించే ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పల్స్‌పోలియో చుక్కలు వేయించుకున్నారా లేదా అనే విషయాన్ని సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులు గుర్తించాలని సూచించారు. చిన్నారులకు చుక్కలు వేసింది లేనిది తెలుసుకునేందుకు వారి చేతి వేలికి సిరా చుక్కతో గుర్తు పెడతారని ఈ గుర్తులను ఉపాధ్యాయులు తప్పకుండా పరీక్షించాల్సి ఉంటుంది. ఎవరైనా చుక్కల వేయించుకోన్నట్లయితే వెంటనే సంబంధిత ఆశా వర్కర్‌కు గాని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందికి గాని తెలియజేసి చుక్కలు వేయించాలి. గ్రామాల్లో మారుమూల ప్రాంతాలు, తండాలు ప్రజలకు పల్స్‌పోలియోపై తెలియజేసి తప్పకుండా చిన్నారులకు చుక్కలు వేయించాల్సిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు ప్రతీ ఒక్కరిపై ఉందని వైద్యఆరోగ్య శాఖ అధికారులు సూచిసున్నారు.

కొనుగోలు కేంద్రాలకు

నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలి



శ్రీపాదరావు చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్

కలెక్టర్ జితేష్ వి. పాటిల్

కామారెడ్డి టౌన్, మార్చి 2: యాసంగిలో ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 347 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సహకార సంఘాల ఆధ్వర్యంలో 325, ఐకేపీ ఆధ్వర్యంలో 22 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడానికి సంబంధితశాఖల అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. యాసంగిలో వచ్చే వరి పంట దిగుబడిని అంచనా వేయాలని అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మీ, జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య, అసిస్టెంట్ సివిల్ సప్లయ్ అధికారి నిత్యానంద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా చూడాలి

నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా చూడాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని మున్సిపల్ ఆధ్వర్యంలో జయశంకర్ కాలనీలో పెంచుతున్న నర్సరీని శనివారం కలెక్టర్ పరిశీలించారు. నర్సరీలో ఉన్న మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మొక్కలు ఎండిపోకుండా నీటిని ప్రతినిత్యం పట్టాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. హరితహారం కోసం మొక్కలను సిద్ధం చేయాలని కోరారు.

జిల్లా కేంద్ర ఆసుపత్రిని పరిశీలించిన కలెక్టర్

జిల్లా కేంద్ర ఆసుపత్రిని శనివారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పరిశీలించారు. హోమియోపతి విభాగంతో పాటు ఆసుపత్రి చుట్టుపక్కల పరిశీలించి వెయిటింగ్ హాల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ విజయలక్ష్మీ, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ బన్సిలాల్, ఆర్ఎంవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీపాదరావుకు ఘన నివాళి

కామారెడ్డి రూరల్: బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి మాజీ స్పీకర్ శ్రీపాదరావు కృషి చేశారని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో శనివారం జిల్లా యువజన, క్రీడల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ స్వర్గీయ శ్రీపాదరావు జయంతిని నిర్వహించారు. ఈ వేడుకలకు కలెక్టర్ హాజరై శ్రీపాదరావు చిత్రపటానికి పూల మాలలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు సర్పంచ్ స్థాయి నుంచి అసెంబ్లీ స్పీకర్ స్థాయి వరకు శ్రీపాదరావు ఎదిగారని కొనియాడారు, కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా యువజన,క్రీడల అధికారి వై.దామోదర్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కొనసాగుతున్న అరాచకపాలన

ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

కామారెడ్డి టౌన్, మార్చి 2: రాష్ట్రంలో గత ప్రభుత్వాన్ని మించి ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అరాచక పాలనను కొనసాగిస్తుందని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి అన్నారు. శనివారం విజయ సంకల్పయాత్రలో భాగంగా జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎమ్మెల్యేలు అధికారులపై అజమాయిషి చేస్తూ వారిని పనులు చేయకుండా చేస్తున్నారని అన్నారు. ఎస్ఐ నుంచి కలెక్టర్ వరకు పైరవీలతోనే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

అధి కారులకు పోస్టింగ్‌లు ఇప్పిస్తున్నారని ఆరోపించారు. డబ్బులు ఇస్తూ పోస్టింగ్‌లు తెచ్చుకుంటున్న అధికారులు వాటిని తిరిగి సంపాదించేందుకు ప్రజలను పీడిస్తు న్నారని అన్నారు. ప్రజలను పీడిస్తే ఉరుకునే ప్రసక్తే లేదని అన్నారు. జిల్లాలో సైతం పలువురు అధికారులకు ఇష్టారితిన పోస్టింగ్‌లు ఇప్పిస్తున్నారని కామారెడ్డి నియోజ కవర్గంలో ఆ విధంగా పోస్టింగ్‌లు తెచ్చుకున్న అధికారులు జాగ్రత్తగా ఉండాలని ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకోమని అన్నారు. రాష్ట్రంలో ఉచితంగా మహిళలకు ఒక బస్సు ప్రయాణంను తీసుకువచ్చి ఆర్టీసీ ఆస్తులను లీజ్‌లకు ఇచ్చే విధంగా లీక్‌లు ఇస్తున్నారని, 200 యూనిట్ల విద్యుత్‌కు ఒక యూనిట్ మించిన మొత్తం డబ్బులు వసూలు చేయడం విడ్డూరంగా ఉందని ఈ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని అన్నారు. ఇష్టారీతిన ఖర్చులు చేసి పనులు చేస్తున్నారే తప్పమిగులు బడ్జెట్‌కు ఎలాంటి చర్యలను రాష్ట్రప్రభుత్వం చేపట్టడం లేదని అన్నారు. దేశ ప్రజలను అన్ని రకాలుగా ఆదుకుంటునే ప్రజారంజక పాలనను బీజేపీ కొనసాగిస్తుందని అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ తీసుకువస్తున్న పథకాలు ప్రజలను ఎంతగానో ఆదుకుంటున్నాయని అన్నారు. ఇప్పటికే నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన పథకాలను వివరిస్తూ విజయ సంకల్ప యాత్ర పేరుతో నిర్వహిస్తున్న యాత్ర ముగిసిం దని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 స్థానాలు గెలుపొందడంతో పాటు దేశవ్యాప్తంగా 400 స్థానాలు గెలుపొందుతామని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, పైపాల్‌రెడ్డి, నీలం చిన్నరాజులు, తేలు శ్రీనివాస్, నరేందర్, శ్రీనివాస్, భరత్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలలో పాల్గొనాలని కలెక్టర్‌కు ఆహ్వానం

నవీపేట,మార్చి2: మండలంలోని నాళేశ్వర్‌లోని శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో జరిగే మహ శివరాత్రి ఉత్సవాలలో పాల్గొనాలని గ్రామానికి చెందిన పలువురు కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతును కోరారు. శనివారం వారు జిల్లా కేంద్రంలో కలెక్టర్‌ను కలిసి ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల 8, 9వ తేదీలలో నాళేశ్వర్‌లోని శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో మహ శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయని వారు కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో బినోల సొసైటీ చైర్మన్ హన్మాండ్లు, మాజీ సర్పంచ్ సరిన్, శివ తదితరులున్నారు.


ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నాళేశ్వర్ వాసులు

పోలియోపై అవగాహన ర్యాలీ

బోదన్ రూరల్, మార్చి 2: ఎడపల్లి మండల కేంద్రంలో శనివారం మండల వైద్యాధికారి వినీత్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీయోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 3వ తేదీ నుంచి మూడు రోజులపాటు పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగ పరుచుకొని 0 నుండి 5సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎచ్ఈఓ రాములు, సూపర్ వైజర్ రాజేశ్వర్, ఏఎన్ఎం నర్సులు, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

నందిపేట: మండల కేంద్రంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం పల్స్ పోలియోపై అవగాహన కల్పించేందుకు మండల వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం, వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలని మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ పేర్కొన్నారు.

డొంకేశ్వర్: ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించే పల్స్ పోలియోపై గ్రామాల్లో అవగాహన కల్పించి ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించేలా చూడాలని సూపర్‌వైజర్ సురేందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఏర్గట్ల పీహెచ్‌సీ హెల్త్ సూపర్ వైజర్ మారుతి ఆరోగ్య సిబ్బందికి సూచించారు.

ఎస్సారెస్పీలోకి స్వల్ప ఇన్‌ఫ్లో



శ్రీరాంసాగర్‌ప్రాజెక్టులో ప్రస్తుత నీటి నిల్వ

మెండోర, మార్చి2: శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు ఎగువ ప్రాంతం మహారాష్ట్రలో నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను తాగునీటి అవసరాల కోసం శుక్రవారం దిగువకు 0.6టీఎంసీల నీటిని విడుదల చేయడంతో శనివారం ఉదయం ప్రాజెక్టులోకి 6944క్యూసెక్కుల స్వల్ప ఇన్‌ఫ్లో నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరు తుందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు ఏడు వేల క్యూసెక్కులు, లక్ష్మీకాలువకు 250క్యూసెక్కులు, ఎస్కెప్ గేట్ల ద్వారా 150క్యూసెక్కులు, అలిసాగర్/గుత్పకు 630క్యూసెక్కులు, సరస్వతికాలువకు 800క్యూసెక్కులు, ఆవిరిరూపంలో 426క్యూసెక్కు లు, మిషన్ భగీరథకు 152 క్యూసెక్కుల నీరు ఔట్‌ఫ్లో వెళ్తుందని తెలిపారు. ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 1070.00అడుగుల (28.871టీఎంసీ)ల నీటి నిల్వ ఉందని వివరించారు. జూన్ 1వ తేదీ నుంచి ప్రాజెక్టులోకి 201 టీఎంసీల నీరు ప్రాజెక్టులోకి చేరగా 193 టీఎంసీల నీటిని వరద గేట్ల ద్వారా ప్రధాన కాలువల ద్వారా విడుదల చేయడం జరిగిందని తెలిపారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

మాక్లూర్, మార్చి2: మండలంలోని ముల్లంగి, ధర్మోరా, కృష్ణనగర్ గ్రామాలలో ట్రైనీ కలెక్టర్ కిరణ్మాయి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ముల్లంగిలో ఉపాధి హామీ పనులను ధర్మోరాలో నర్సరీ, వైకుంఠధామం, కృష్ణనగర్‌లో ఐకెపీ మహిళ కార్యక్రమాల అమలును పరిశీలించారు. ఆమెతో పాటు డీఆర్‌డీవో, ఎంపీడీవో, తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి

నవీపేట,మార్చి2: గ్రామాలలో ఇంటి పన్నులను వందశాతం వసూలు చేయాలని డీపీవో చక్రవర్తుల తరుణ్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు సమయ పాలన పాటించాలని, గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా వంటి విషయాలలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి యొహన్, ఎంపీడీవో నాగనాథ్, ఎంపీవో రామకృష్ణ, తదితరులున్నారు.

పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ చేసింది శూన్యం

● నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డిచ్‌పల్లి,మార్చి2: తెలంగాణ రాష్ట్రంలో గడిచిన పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిన అభివృద్ధి శూన్యమని అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. శనివారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని నడిపల్లి పంచాయతీలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 6గ్యారంటీల్లో భాగంగా గృహజ్యోతి,200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం శనివారం ఎమ్మెల్యే భూపతిరెడ్డి ప్రారంభించారు. జిల్లాలో విద్యుత్ వినియోగదారులు 200యూనిట్ల లోపు ఉండి 0 బిల్లు వచ్చే వారు 49లక్షల మంది వినియోగదారులు ఉన్నారని రూరల్ నియోజక వర్గంలో 47,710 లబ్ధిదారులు ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు. దివంగత సీఎం వైఎస్ఆర్ 2004లోనే రైతులకు ఉచితంగా విద్యుత్ సరఫరా అందించారని గుర్తు చేశారు. 2024 లో కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చి సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన 200యూనిట్ల గృహాలకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేయడం గొప్పవిషయమని హామీ ఇచ్చి అమలు చేయడం కాంగ్రెస్ తోనే సాధ్యమన్నారు. ఇప్పటికే గ్యాస్ వినియోగ దారులకు రూ.500లకే సిలిండర్‌లు ఇచ్చే ప్రక్రియ జరుగుతోందని, 6గ్యారంటీల్లో 4 పూర్తి చేశామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మేడారం సమ్మక్క సారక్క జాతరకు 16లక్షల మంది మహిళలు ఉచితంగా బస్సు ప్రయాణం చేశారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కట్టిన మేడిగడ్డ మేడి పండులాగ తయారైందని నాణ్యత లోపంతో ఫిల్లర్లు కుంగి పోయాయని కాళేశ్వరం ప్రాజెక్టు పని రాకుండా పోయిందని, సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలను ప్రజాధనం దుర్వినియోగం చేయడానికి నిర్మించారని వాటి వల్ల ఎక్కడ కూడా సాగు పెరగలేదని అన్నారు. రూరల్ నియోజకవర్గానికి3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూర య్యాయని అత్యంత నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గడిచిన 10ఏళ్ల కాలంలో ఒక్క ఇళ్లు కూడా నిర్మించాని బీఆర్ఎస్ కు ప్రజలు బుద్ధి చెప్పరని గుర్తు చేశారు. రాష్ట్రంలో పసుపు ను రైతులు ఎక్కువగా పండించడం లేదని అందుకనే ప్రస్తుతం పసుపు ధర పెరుగుతుందని దీనిని బాసటగా తీసుకొని బీజేపీ నాయకులు తమ ఘనత వల్లే పసుపు ధర పెరిగిందని చెప్పుకోవడం సిగ్గు చేటు అని అన్నారు. బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బీసీ కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సీజీఎం ఫైనాన్స్ రవీంద్రనాథ్, ట్రాన్స్‌కో ఏస్ఈ రవీందర్, డీఈ ఉత్తమ్ కుమార్ జాడే, ఏడీ శ్రీనివాస్ రావు, ఏఈ సాయిలు, డీపీవో చక్రవర్తి తరుణ్ తేజ్, డీఎల్పీవో శ్రీనివాస్, ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, ఈవో కిషన్ రావు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు అమృతపూర్ గంగాధర్, కంచెట్టి గంగాధర్, పొలసాని శ్రీనివాస్, ముప్ప గంగారెడ్డి, శేఖర్ గౌడ్, శాంసన్, పులివెంకటేశ్వరరావు, డా.షాదుల్ల, వాసుబాబు, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లిలో గృహజ్యోతి జీరో కరెంట్ బిల్లును వినియోగదారునికి అందిస్తున్న రూరల్ ఎమ్మెల్యే

సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణిని అభినందించి ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఆర్మూర్‌రూరల్: సాఫ్ట్‌బాల్ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టు గెలుపునకు కృషి చేసిన క్రీడాకారులను శనివారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అభినందించారు. ఇటీవల జరిగిన జూని యర్ నేషనల్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలలో రాష్ట్ర బాలికల జట్టు బంగారు పతకం సాధించింది. ఆర్మూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళాశాలకు చెందిన అజ్మీర ఇందును, శిక్షణ ఇచ్చిన పీడీ స్వప్నలను ఎమ్మెల్యే భూపతిరెడ్డి అభినందించారు. భవిష్యత్ లో జాతీయ జట్టులో స్థానం సాధించి దేశ కీర్తి ప్రతిష్ఠలను ఇనుమ డింపజేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్ర మంలో కళాశాల ప్రిన్సిపాల్ దణవేణి, గడీలరాములు, గంగామోహన్, వ్యాయమ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా కొనసాగిన మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అక్కపల్లి సుజాత

రుద్రూరు, మార్చి2:రుద్రూరు మండల సమీకృత కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. ఎంపీపీ అక్కపల్లి సుజాత అధ్యక్షతన శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమా వేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్య, ఆరోగ్య, విద్య, విద్యుత్, తాగునీటి సరఫరా, పంచాయతీ రాజ్, ఇందిరాక్రాంతి, స్త్రీ మరియు శిశు సంక్షేమ, పశు పోషణ, ఉపాధిహామీ శాఖల అధికారులు హాజరై తమ నివేదికలను చదివి వినిపించారు. ఈ సమావేశంలో అంగన్ వాడీ కేంద్రా లకు మంజూరు చేసిన నూతన భవనాల పనులు పూర్తి కానందున అసం పూర్తిగా ఉన్నాయని త్వరగా పూర్తి చేయాలని సూపర్ వైజర్ శ్రీలత విన్నవించారు. ఈసమావేశంలో ఆర్టీసీ, ఉద్యానవన శాఖ విభాగాల అధి కారులు గైర్హాజర య్యారు. ఈసమా వేశంలో ఎంపీడీవో సురేష్ బాబు, జడ్పీటీసీ నారోజీ గంగారాం, తహసీల్దార్ వెంకటేష్, ఎంపీవో సాయిలు, ఎంపీటీసీలు, ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు చెల్లించాల్సిందే అంటున్న కళాశాలల యాజమాన్యం

● విద్యార్థుల వద్ద ఫీజులు వసూళ్లు చేస్తున్న ప్రైవేట్ బీఈడీ, డిగ్రీ కళాశాల యాజమాన్యాలు ● కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

డిచ్‌పల్లి, మార్చి 2: దేవుడు వరమిచ్చిన పూజరి కరుణించాలేదనే చందంగా తయారైంది. తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని ప్రైవేట్ బీఈడీ, డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థుల పరిస్థితి. యూనివర్సిటీ పరిధిలోని ప్రైవేట్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు 2022 నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక పోవడంతో వారి నుంచి కళాశాలల యాజమన్యాలు ముందస్తుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ వసూళ్లు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి రావల్సిన ఫీజు రియింబర్స్‌మెంట్ రాకపోవడంతో యాజమాన్యాలు విద్యార్థుల నుంచి అక్రమంగా వేలాది రూపాయలు ముక్కు పిండి వసూళ్లు చేస్తున్నారు. 2022-23 విద్యాసంవత్సరం నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం బీసీ,ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రియింబర్స్‌మెంట్ నేటికి రాకపోవడంతో కొన్ని ప్రైవేట్ కళాశాలలు అక్రమ ఫీజుల వసూళ్లకు తెరలెపారు. ఫీజులు పూర్తి స్థాయిలో విద్యార్థుల నుంచి వసూళ్లు చేస్తున్నారు. లేదంటే పరీక్షల ఫీజు తీసుకునేది లేదని హెచ్చరిస్తున్నారు. దీంతో విద్యార్థులకు వేరే గత్యంతరం లేక తల్లిదండ్రులను ఒప్పించి బయట నుంచి అప్పులు తీసుకొచ్చి కళాశాలలకు చెల్లిస్తున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థులకు రావల్సిన రియింబర్స్‌మెంట్ చెల్లించలేదు. రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు జరగడం ప్రభుత్వం మారడం వేగంగా జరిగిపోయాయి. కానీ విద్యార్థులకు మాత్రం ఫీజు రియింబర్స్‌మెంట్ క్లియర్‌కాలేదు. నిజామాబాద్, కామా రెడ్డి జిల్లాలోని ప్రైవేట్ కళాశాలలు తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోకి వస్తాయి. ఈ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్ రాక పూర్తి స్థాయిలో యాజమన్యాలు ముందుగానే ఫీజులు వసూళ్లు చేస్తు విద్యార్థులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ముందుగా ఫీజు రియింబర్స్‌మెంట్ చెల్లించి ప్రభుత్వం నుంచి వచ్చాక విద్యార్థులకు ఇచ్చేస్తామని యాజమాన్యాలు అంటున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. దీంతో నిరుపేద ఎస్సీఎస్టీబీసీ విద్యార్థులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. తక్షణమే యూనివర్సిటీ అధికారులు స్పందించి ఫీజు రియింబర్స్‌మెంట్ పేరిట అక్రమ వసూళ్లు చేస్తున్న కళాశాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల

వాహనంపై నుంచి పడి ఒకరి మృతి

వర్ని,మార్చి2: వర్ని మండలం బడాపహాడ్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నవీపేట మండలం ఫకీరాబాద్ గ్రామానికి చెందిన జగ్గు రాజశేఖర్ మృతి చెందినట్లు ఎస్ఐ కృష్ణ కుమార్ తెలిపారు. బడా పహడ్ పుణ్య క్షేత్రంలో బంధుమిత్రులతో కలిసి మొక్కులు తీర్చుకుని ఓ బోలేరో వాహనంలో తిరుగు ప్రయాణం అవగా ఈ దుర్ఘటన చోటు చేసుకున్నట్లు ఎస్ఐ వెల్లడించారు. వాహన డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో వెనుక భాగాన కూర్చున్న రాజశేఖర్ వాహనం పై నుంచి అక్కడికక్కడే మృతి చెందినట్లు చెప్పారు. ఇదే ప్రమాదంలో ఉదయ్ అనే వ్యక్తి కింద పడడంతో తీవ్ర గాయాలు అయినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శవ పంచనామా అనంతరం మృతదేహన్ని బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నవీపేట,మార్చి2: మండల కేంద్రంలోని తడగామకు చెందిన కొండూరు సాయిలు(33)అనే వ్యక్తి శుక్రవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఏఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. మృతుడి భార్య సోని రెండు రోజుల క్రితం తన భర్తతో గొడవ పడి తన రెండు సంవత్సరాల కుమారుడిని తీసుకుని మెట్‌పల్లిలోని పుట్టింటికి వెళ్లిపోయిందని అన్నారు. గతంలో సాయిలుకు రెండు వివాహలు కాగా మొదటి ఇద్దరి భార్యలతో విడాకులు జరిగాయని, మూడవ భార్య సైతం తన పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్థాపం చెందిన ఆయన తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. మృతుడు గతంలో ఆటో డ్రైవర్‌గా పని చేయగా ఇటీవల కూలీ పని చేస్తున్నాడని ఆయన పేర్కొన్నారు. మృతుడి తల్లి సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

కందకుర్తి గోదావరిలో మృతదేహం లభ్యం

రెంజల్,మార్చి2: మండలంలోని కందకుర్తి గోదావరి నదిలో పాందుఫారానికి చెందిన ఓర్సు బాలమ్మ(32)అనే మహిళ గోదావరిలో శుక్రవారం స్నానం చేసేందుకు నీటిలో దిగిన సమయంలో ఎగువ నుంచి బాబ్లీ ప్రాజెక్టు నీరు రావడంతో గల్లంతు అయింది. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని జాలర్లతో వెతికించిన ఫలితం లేకుండా పోయింది. శనివారం ఉదయం మృతదేహం నీటిలో తేలిందని అటు గోదావరి వైపు వెళ్లిన వ్యక్తులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్ మృతదేహన్ని జాలర్ల సహయంతో బయటకు తీయించి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఆసుపత్రికి తరలించినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. మృతురాలి భర్త ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పదో తరగతి విద్యార్థులకు మెటీరియల్స్ పంపిణీ

మోర్తాడ్, మార్చి2: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులకు శనివారం అవసరమయ్యే మెటిరియల్స్‌ను పలువురు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జక్కం నాగరాజు, మామిడల మనోహర్, సామ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పని సరిగా చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటరమణ

డొంకేశ్వర్, మార్చి2: రేషన్‌కార్డు కలిగిన ప్రతిఒక్క లబ్ధిదారుడి వివరాలను ఈకేవైసీ ద్వారా తప్పనిసరిగా నమోదు చేసేలా చూడాలని డొంకేశ్వర్ మండల తహసీల్దార్ వెంకటరమణ రేషన్‌డీలర్‌లకు ఆదేశించారు. డొంకేశ్వర్ మండలం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్‌డీలర్‌లతో తహసీల్దార్ వెంకటరమణ సమావేశం నిర్వహించారు. రేషన్‌కార్డుల్లో ఆధార్ కార్డు వివరాలు సరిగ్గా నమోదు కానీ వారి వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు పంపించామని తహసీల్దార్ తెలిపారు. తమ పరిధిలోని కార్డుదారులకు ఈకేవైసీ చేసే విధంగా చూడాలని కోరారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ వెంకటరమణను రేషన్‌డీలర్లు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజేశ్వర్, సంఘం నాయకులు రాజు, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలకు మృతదేహం అప్పగింత

నవీపేట,మార్చి2: మండలంలోని బినోలకు చెందిన గట్టు ముత్తెమ్మ (65)అనే వృద్ధురాలు శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమెకు ప్రభు చరణ్, దేవదాస్ అనే ఇద్దరు కుమారులు, సుశీల అనే కుమార్తె ఉన్నారు. మృతురాలి కుమారుడు ప్రభు చరణ్ సీపీఐ ఎంఎల్ ప్రజాపంథాలో సభ్యుడిగా ఉన్నారు. ముత్తెమ్మ మృతదేహం వైద్య విద్యార్థులకు ఉపయోగపడాలన్న ఉద్దేశంతో కుటుంబ సభ్యులు నిజామాబాద్ మెడికల్ కళాశాలకు అప్పగించారు.ఈ సందర్భంగా ముత్తెమ్మ మృతదేహనికి నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీ.ప్రభాకర్, డివిజన్ కార్యదర్శి వెంకన్న, నాయకులు గంగాధర్, రాజేశ్వర్, సాయిరెడ్డి, సాయిలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

యానంపల్లిలో క్షయ వ్యాధిపై సర్వే

డిచ్‌పల్లి, మార్చి 2: మండలంలోని యానంపల్లి గ్రామంలో క్షయ వ్యాధి నివారణాకు వైద్యాశాఖ అధికారులు ఇంటింట క్షయ వ్యాధి సర్వే ను శనివారం నిర్వహించారు. ఆరోగ్య విస్తీర్ణాధికారి శంకర్ ఆధ్వర్యంలో సర్వే చేశారు. దగ్గు, తీవ్రమైన జ్వరం ఉన్న వారికి తెమడ శాంపిల్స్ తీసుకొని వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామని శంకర్ తెలిపారు. జిల్లాలో 530 గ్రామ పంచాయతీల్లో 19పంచాయతీ లు క్షయ రహిత గ్రామాలుగా ఎంపిక చేశామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణాధికారి శంకర్, టీబీ కోఆర్డినేటర్ రవి గౌడ్, సూపర్‌వైజర్ పద్మ, ల్యాబ్ సూపర్‌వైజర్ స్రవంతి, ఆరోగ్య కార్యకర్తలు గంగుబాయి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎంని కలిసిన కాంగ్రెస్ నాయకులు



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఆర్మూర్‌రూరల్, మార్చి2: ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు జితేందర్‌రెడ్డి శనివారం రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అదే విదంగా నిజామాబాద్‌కు చెందిన సీనియర్ నాయకుడు ఉర్దూ అకాడమి చైర్మన్‌గా నియామితులైన తాహెర్‌బిన్‌హందాన్ సీఎం నివాసానికి రాగా ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు

పంచాయతీల్లో పకడ్బందీగా పన్నులు వసూలు చేయాలి

● డీపీవో చక్రవర్తి తరుణ్ తేజ్



నడిపల్లిలో పన్నుల వసూళ్లపై ఈవోతో మాట్లాడుతున్న డీపీవో

డిచ్‌పల్లి,మార్చి 2: గ్రామాల్లో పంచాయతీ పన్నుళ్ల వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పంచాయతీ కార్యదర్శులు ప్రతి రోజు పన్నుళ్ల వసూళ్ల పై ప్రత్యేక కార్యచరణ సిద్ధం చేసుకోవాలని డీపీవో చక్రవర్తి తరుణ్ తేజ్ అన్నారు. శనివారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని నడిపల్లి పంచాయతీ కార్యాలయంలో పన్నుళ్ల వసూళ్లపై ఈవో నిట్టుకి షన్‌రావును ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రతీ ఒక్కరు పన్నుల వసూళ్లపై ప్రత్యేక చొరవ చూపాలన్నారు. వేసవి దృష్య తాగునీటి ఎద్దడి సమస్య రాకుండా ఎప్పటికప్పుడు బోర్ల నుంచి వస్తున్న నీటి పరిస్థితులను గమనిస్తుండాలని సూచించారు. ఆయన వెంట డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, డీపీసీ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ రాజేశ్, పాల్గొన్నారు.

తొర్లికొండలో ఘనంగా వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

జక్రాన్‌పల్లి, మార్చి2: మండలంలోని తొర్లికొండ గ్రామంలో శనివారం వేంకటేశ్వరస్వామి దేవాలయ ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. అనంతరం స్వామివారి పల్లకిని భక్తులు కొండపై చుట్టు ప్రదక్షిణ చేశారు. ఆలయంలో భక్తులు, గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. నూతనంగా నిర్మించనున్న వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి భక్తులు, గ్రామస్థులు విరాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీసభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రజాపాలన కౌంటర్ ఏర్పాటు

బోధన్ రూరల్, మార్చి 2: ఎడపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ప్రజాపాలన కౌంటర్‌ను ఎంపీవో సుభాష్ చంద్రబోస్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని మండల ప్రజల సౌకర్యార్థం కౌంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. దీనిని మండల ప్రజలు సద్వినియోగ పరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణపల్లి పంచాయితీ కార్యదర్శి భాస్కర్ తదితరులు ఉన్నారు.

తల్లిదండ్రులుగా తమ బాధ్యత నెరవేర్చాలి

జక్రాన్‌పల్లి, మార్చి2: విద్యార్థుల్లో చదువు పట్ల శ్రద్ధ, మనోధైర్యం, ఆత్మస్థైర్యం, సంకల్పబలం, పట్టుదల, మనో విజ్ఞానం పెరగాలంటే తల్లిదండ్రులుగా మనబాధ్యత నెరవేర్చాలని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని తొర్లికొండ గ్రామంలో ఎస్సీ బాలుర వసతిగృహంలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో గ్రామప్రత్యేక అధికారి, ఎంఈవో శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యాసనాలకు అలవాటు కాకుండా తల్లిదండ్రులు గమనించాలన్నారు. సమాజంలో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు విద్య, సంస్కారం ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ సంతోష్, ప్రదానోపాధ్యాయులు జంగం అశోక్, వ్యాయమ ఉపాధ్యాయుడు సంకేపల్లి గంగాధర్, అశోక్, సురేష్ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు జీరో బిల్ అందజేత

ఆర్మూర్‌టౌన్,మార్చి2:పట్టణంలోని రాంనగర్‌కాలనీలోవిద్యుత్ డీఈ హరిచందర్‌నాయక్ శనివారం లబ్ధిదారులకు జీరో బిల్లులను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి కార్యక్రమంలో భాగంగా 200 యూనిట్లు వరకు వినియోగించుకున్న లబ్ధిదారులకు ఈ పథకం వర్తిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ శ్రీధర్, ఏఈ మనిష, జేఏవో హరిష్, ప్రకాష్, ప్రభాకర్ తదిత రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన తహసీల్దార్

కోటగిరి,మార్చి2: కోటగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని శనివారం తహసీల్దార్ సునీత తనిఖీ చేశారు. ఆసుపత్రిలో సిబ్బంది విధి నిర్వహణ సక్రమంగా లేకపోవడం అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు సరైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉన్నతాధిఆరులకు ఫిర్యాదు చేసి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్గట్ల పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం

ఏర్గట్ల, మార్చి 2:మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా విద్యాబోధనలు చేసి, సాంస్కృతిక కార్యక్రమాలు చేయగా అనంతరం వారికి పాఠశాల హెచ్‌ఎం బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు గణేష్, లక్ష్మీ ప్రసన్న, అనిత, మాజీ చైర్మర్ చిన్న చిన్నయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో గంజాయి పట్టి వేత

● ఒకరి అరెస్టు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సీఐ స్టీవేన్‌సన్

డిచ్‌పల్లి/ఆర్మూర్‌రూరల్, మార్చి2: ఆర్మూర్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని సీఎంజీ ఆసుపత్రి సమీపంలో గంజాయి తరలిస్తున్న ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ స్టీవేన్‌సన్ తెలిపారు. ఎక్సైజ్ పోలీసులు రూట్‌వాచ్ నిర్వహిస్తుండగా బైక్‌పై అనుమానా స్పదంగా వెళ్తున్న గరుకుల పవన్‌కళ్యాణ్‌ను పట్టుకొని తనిఖీ చేయగా గంజాయి ముఠా లభించిందన్నారు. అతని వద్ద లభించి 170 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి రవాణాపై విచారించగా నిజామాబాద్‌లోని గృహ కల్ప కాంప్లెక్స్ హసద్ బాబానగర్ నందిగుట్ట ప్రాంతాల నుంచి కొనుగోలు చేశానని, ఇతర ప్రాంతాల్లో ఎక్కువ ధరకు విక్రయిస్తుంటానని వెల్లడించారని ఆయన తెలిపారు. తనిఖీల్లో సబ్‌ఇన్‌స్పెక్టర్‌లు ప్రమోద్‌చైతన్య, చంద్రమౌళి, ఎక్సైజ్ సిబ్బంది ధర్మేందర్, వికాస్, సందీప్, సాయిబాబా, శ్రీనివాస్, మోహన్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

అచ్చయపల్లి పంచాయతీ రికార్డుల తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీవో

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 2 : ప్రస్తుత వేసవి కాలంలో గ్రామంలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్, పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ఆయన శనివారం మండలంలోని అచ్చయపల్లి గ్రామ పంచాయతీని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని, పైప్‌లైన్‌ల లీకేజీ ఉంటే మరమ్మతులు చేపట్టాలన్నారు. బోరు మోటార్లు కాలినా జాప్యం చేయకుండా వెంటనే మరమ్మతులు చేయించాలని, గ్రామంలో వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శి రమ్యశ్రీని ఆయన ఆదేశించారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

తాడ్వాయి, మార్చి 2: మండలంలోని నందివాడలో శనివారం ప్రతినిధులు సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ ప్రత్యేక దృష్టితో నందివాడ గ్రామానికి రూ.5లక్షల నిధులు మంజూరు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన అనతి కాలంలోనే నిధులు మంజూరు చేయడం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగారెడ్డి, వేణు, ప్రశాంత్‌గౌడ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

తాడ్వాయి, మార్చి 2: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధులు హేమంత్ కుమార్, నాగరాజు, రాజేందర్‌లు తెలిపారు. శనివారం మండలంలోని నందివాడ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. ప్రతీ విద్యార్థి కష్టపడి చదివితేనే దేశంలో ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కృష్ణాకర్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, సరిత, సంతోష్, దత్తాచారి తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని ఒకరి మృతి

సదాశివనగర్, మార్చి 2: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని షేక్‌అలీ(46) మృతి చెందినట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు. జిల్లా కేంద్రంలోని బతుకమ్మ కుంటకు చెందిన షేక్‌అలీ కొబ్బరి బోండాల వ్యాపారం చేస్తూ పని నిమిత్తం కామారెడ్డి నుంచి గాంధారికి టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్లగా సదాశివనగర్ బ్రిడ్జి వద్ద వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొట్టడంతో షేక్‌అలీ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

సదాశివనగర్, ఫిబ్రవరి 2: చట్టాలపై అవగాహన పెంచుకోవాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది రమేష్‌చంద్ విద్యార్థులకు తెలిపారు. శనివారం మండలంలోని జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయంలో చట్టాలపై అవగాహన కల్పించారు. బాలల హక్కులు, బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, సామాజిక మాధ్యమాల వల్ల ఎదురవుతున్న సమస్యలు, మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళల రక్షణ చట్టాలు, బాలల హక్కులు, విద్యహక్కు చట్టాలు, గృహహింస నిరోధక చట్టాలను, పోక్సో చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అమృతరాజేందర్, సాయికృష్ణ, సాయిప్రణీత్, ప్రిన్సిపాల్ రాగిణి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని శవం లభ్యం

కామారెడ్డి టౌన్, మార్చి 2: కామారెడ్డి పట్టణంలోని పీఎంహెచ్ కాలనీలో గుర్తుతెలియని శవం శనివారం లభ్యమైందని పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. దాదాపు 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు కలిగి ఉంటాడని మృతదేహం పాక్షికంగా కుళ్లిపోయినట్లు తెలిపారు. వ్యక్తి ఒంటిపై నీలం రంగు టీషర్టు, నీలం రంగు నైట్ ప్యాంటు ధరించి ఉన్నాడని, ఎడమచేతికి రాగి కడియం ఉందని తెలిపారు. సదరు వ్యక్తిని గుర్తుపట్టిన వారు పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

దోమకొండ, మార్చి 2: మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా నాలుగు గ్యారంటీలను అమలు చేయడం జరిగిందన్నారు. మార్చి నుంచి జీరో విద్యుత్ బిల్లును ప్రజలు పొందుతారన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆశబోయిన శ్రీనివాస్, రామస్వామిగౌడ్, దోమకొండ పట్టణాధ్యక్షుడు సీతారాం మధు, ఎంపీటీసీ నిమ్మ శంకర్, ప్రభాకర్‌రెడ్డి, తాటిపల్లి శ్రీకాంత్, సీతారాం ప్రసాద్, గోపాల్‌రెడ్డి, నాగారపు రాములు, రమేష్, నర్సింలు, రసూల్, అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.


దోమకొండలో సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పల్స్ పోలియోను విజయవంతం చేయండి

మద్నూర్, మార్చి 2: ఉమ్మడి మద్నూర్ మండలంలోని డోంగ్లీ పీహెచ్ సీ పరిధిలో ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యురాలు శ్రీలేఖ అన్నారు. డోంగ్లీ మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులకు పల్స్ పోలియో వేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. తల్లిదండ్రులు కొంత సమయం చిన్నారుల కోసం వెచ్చించాలని సూచించారు. దేశ వ్యాప్తంగా పల్స్ పోలియో దేశ వ్యాప్తంగా జరుగుతుందని, చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయాలన్నారు. 6820 మంది డోంగ్లీ పీహెచ్‌సీ పరిధిలో ఉన్నారని, వారికి 164 మంది సిబ్బంది, 41 సెంటర్లలో చుక్కల మందువేయనున్నట్లు వెల్లడించారు. మొదటి రోజు ఆయా సెంటర్లలో చుక్కల మందు వేస్తారని, రెండవ రోజు, మూడవ రోజు ఇంటింటికీ తిరిగి చుక్కల మందు వేస్తారన్నారు. డోంగ్లీ సబ్ సెంటర్ పరిధిలోని 11 కేంద్రాలలో కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు పోలియో చుక్కలు వేయించాలని కోరారు.

పెద్ద కొడప్‌గల్: నేడు మండలంలో నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి సమీయుల్లా తెలిపారు. పల్స్ పోలియో విజయవంతం చేసేందుకు గాను మండలంలోని 5 సబ్ సెంటర్లకు అనుబంధంగా 23 బూత్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. అంతేగాక ఒక మొబైల్ టీంను ఏర్పాటు చేశామని తెలిపారు. 0 నుంచి 5 సంవత్సరాల పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు.

నాగిరెడ్డిపేట: ఆదివారం మండలంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సృజన్ కుమార్ తెలిపారు. మండలంలో 0 - 5 సంవత్సరాల లోపు పిల్లలు 2635 మంది ఉన్నట్లు ఆయన తెలిపారు. మండలంలో 26 బూత్‌లను ఏర్పాటు చేసినట్లు, ఐదు సంవత్సరాల లోపు పిల్లందరికీ వైద్య సిబ్బంది పల్స్ పోలియో చుక్కలు వేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆదివారం నాడు పల్స్ పోలియో చుక్కలు వేసుకుని పిల్లలకు సోమ, మంగళవారం రెండు రోజులు గ్రామాల్లో ఇంటింటా తిరిగి పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయనున్నట్లు ఆయన తెలిపారు.

'గృహజ్యోతి'తో పేద, మధ్య తరగతి కుటుంబాల్లో వెలుగులు


జీరో కరెంట్ బిల్లును అందజేస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు


ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 2 : గృహజ్యోతి పథకంతో పేద, మధ్య తరగతి కుటుంబాల్లో వెలుగులు నింపుతుందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. శనివారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని బీసీ కాలనీలో గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలను ప్రారంభించారు. జీరో కరెంట్ బిల్లును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మి ద్వారా రూ.500లకే ప్రభుత్వం సిలిండర్ ఇస్తుందన్నారు. జీరో బిల్లు రాని వారు మండల పరిషత్ కార్యాలయంలో రేషన్‌కార్డుతో పాటు కరెంట్ మీటర్ నెంబర్ జత చేసి ఇవ్వాలని తెలిపారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని సోమార్‌పేట్ రోడ్డు పక్కన నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో కరెంట్, నీటి సౌకర్యం లేదని, సౌకర్యాలు కల్పించి రెండు నెలల్లో పంపిణీ చేస్తామని అన్నారు. ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫోన్ ద్వారా సమస్యను తెలపాలని అన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్, డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్, విద్యుత్ డీఈ గణేష్, ఏఈ సత్యనారాయణగౌడ్, నాయకులు గయాజుద్దీన్, విద్యాసాగర్, సాయిబాబా, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు జీరో కరెంట్ బిల్లు అందజేత

పెద్ద కొడప్‌గల్: జుక్కల్ మండలంలోని పెద్దఏడ్గి గ్రామానికి చెందిన లబ్ధిదారులకు గృహజ్యోతి పథకంలో భాగంగా స్థానిక నాయకులు జీరో కరెంట్ బిల్లును అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల హామీల్లో ఇచ్చిన కార్యక్రమంలో భాగంగా శనివారం పెద్దఏడ్గి గ్రామంలో లబ్ధిదారులకు జీరో కరెంట్ బిల్లు అందజేయడం జరిగిందని తెలిపారు. గృహజ్యోతి పథకం అమలు ద్వారా పేద ప్రజలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ప్రతీ నెల విద్యుత్ బిల్లు చెల్లించే పేద ప్రజలకు ఎంతగానో లబ్ధి చేకూరుతుందని తెలిపారు. 200 యూనిట్ల వరకు కరెంట్ బిల్లు కట్టనవసరం లేదని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అస్పత్‌వార్ వినోద్, అనిల్, రవీందర్, ఫయింఖాన్, గంగాధర్, గంగాగౌడ్, నారాయణ తదితరులు ఉన్నారు.


జీరో కరెంట్ బిల్లు అందజేస్తున్న నాయకులు

ఎమ్మెల్యే మారినా.. పేరు మార్చలే!


నాగిరెడ్డిపేట ఎంపీపీ కార్యాలయంలోని బోర్డుపై ఇంకా ఎమ్మెల్యేగా జాజాల సురేందర్ పేరు దర్శనమిస్తున్న దృశ్యం

నాగిరెడ్డిపేట, మార్చి 2 : రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగి కొత్త ప్రభుత్వం కొలువు దీరిన రెండు నెలలు గడిచినా, కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు తమ పదవి బాధ్యతలు చేపట్టి రెండు నెలలు దాటినా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లోని బోర్డుల పైన అధికారులు ఎమ్మెల్యే పేరును ఇంత వరకు మార్చలేదు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా మదన్‌మోహన్‌రావు ఎన్నికైన ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ కార్యాలయం బోర్డుపైన ఇంకా ఎమ్మెల్యే స్థానంలో జాజాల సురేందర్ పేరే దర్శనమిస్తోంది. నియోజకవర్గంలోని నాగిరెడ్డిపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని బోర్డుపైన అధికారులు ఇంత వరకు ఎమ్మెల్యే పేరును మార్చలేదు. ఎమ్మెల్యే ఎన్నిక కాగానే బోర్డుపై పేరు మార్చాల్సి ఉండగా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండల ప్రజాపరిషత్ కార్యాలయం ప్రధాన ద్వారం పక్కనే ఈ పాలకవర్గం బోర్డు ఉండటంతో నిత్యం కార్యాలయానికి వచ్చిపోయే మండల ప్రజాప్రతినిధులు, ప్రజలు ఈ బోర్డు వంక చూసి ఎమ్మెల్యేగా జాజాల సురేందర్ పేరు ఇంకా బోర్డుపైన దర్శనమిస్తుండటంతో ముక్కున వేలసుకుంటున్నారు. అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతున్నారు. ఇకనైనా అధికారులు మేల్కొని వెంటనే కార్యాలయంలోని బోర్డుపైన ఎమ్మెల్యే పేరు మార్చాలని పలువురు కోరుతున్నారు.


అంకోల్ క్యాంప్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్‌లో ప్రాధాన్యత లేకే కాంగ్రెస్‌లోకి

నసురుల్లాబాద్, మార్చి 2: బీఆర్ఎస్‌లో తమకు సరి అయిన ప్రాధాన్యత లేకపోవడంతోనే కాంగ్రెస్ పార్టీలోకి వెళుతున్నామని మండల బీఆర్ఎస్ నాయకులు అన్నారు. నసురుల్లాబాద్ మండలంలోని అంకోల్ క్యాంప్ గ్రామంలో శనివారం మండల బీఆర్ఎస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్కి సొసైటీ చైర్మన్ దివిటి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ నిర్బంధ పాలన నుంచి సంకెళ్లు తెంచుకుని ప్రజాపాలన వైపు వస్తున్నామని అన్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన నలుగురు సర్పంచ్‌లు, ఒక ఎంపీటీసీ ఈనెల 5వ తేదీన కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు, బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నందుకు, ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కిషోర్ యాదవ్, మండల కో ఆప్షన్ వాజీద్, హాజీపూర్ సర్పంచ్ చంటి, అంకోల్ తండా సర్పంచ్ బాద్య, దుర్కి ఎంపీటీసీ నారాయణ, దుర్కి ఉప సర్పంచ్ ఖదీర్, నాయకులు గంగాధర్, ఇక్బాల్, తుకారం, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య

తీర్చాలంటూ మహిళల ఆందోళన

బీర్కూర్, మార్చి 2: బీర్కూర్ మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో గత నెల రోజులుగా తాగునీరు సరఫరా కాక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో శనివారం కాలనీకి చెందిన మహిళలు ఖాళీ బిందెలతో గ్రామ పంచాయతీకి చేరుకున్నారు. జీపీ ఎదుట ఖాళీ బిందెలు పెట్టి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల రోజులుగా కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా కావడం లేదని దీంతో పక్క కాలనీల నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్య ఎందుకు పరిష్కరించడం లేదని పంచాయతీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలుమార్లు విన్నవించినా జీపీ సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించి తాగునీరు సరఫరా చేయాలని మహిళలు డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరిస్తామని జీపీ సిబ్బంది హామీ ఇవ్వడంతో వెనుదిరిగి వెళ్లిపోయారు.


బీర్కూర్ జీపీ ఎదుట ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

నూతన వంతెన నిర్మించండి సారూ..!


శిథిలావస్థకు చేరుకున్న వంతెన

పెద్ద కొడప్‌గల్, మార్చి 2: మండలంలోని విఠల్‌వాడీ, విఠల్‌వాడీ తండా మధ్య శివారులో ఉన్న వరద కాలువపై నూతన వంతెన నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. విఠల్‌వాడీ, బాబల్‌గాం, చింతల్‌వాడీ, లింగంపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు ప్రతినిత్యం ఈ వంతెనపై నుంచి రాకపోకలు సాగిస్తారు. దీంతో పాటుగానే పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రానికి రావాలన్నా ఈ వంతెనపై నుంచి ప్రయాణించాల్సి ఉంటుంది. గత వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు ఈ వంతెన కింది భాగం కుంగిపోయింది. దీంతో విఠల్‌వాడీ తండా, విఠల్‌వాడీ గ్రామాల ప్రజలు తాత్కాలికంగా రాకపోకలు సాగేందుకు వంతెనకు ఒక వైపు మరమ్మతులు చేపట్టారు. దీంతో వంతెనకు ఒక వైపు నుంచి ప్రస్తుతం రాకపోకలు సాగిస్తున్నారు. రెండు వాహనాలు వంతెన పైకి ఒకే సారి వస్తే రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. అంతేగాకుండా రానున్న వర్షాకాలంలో భారీ వర్షాలు కురిస్తే వంతెన కొట్టుకుపోయే ప్రమాదం ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ వంతెన కూలిపోతే మండల కేంద్రానికి ఐదారు గ్రామాల ప్రజలు రావడానికి అంతరాయం కలుగుతుందని తెలిపారు. వర్షాకాలం వచ్చేలోపు ఈ వరదకాలువపై నూతనంగా వంతెన నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రవేశాల కోసం ఆహ్వానం

కామారెడ్డి రూరల్, మార్చి 2: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతి ఇంగ్లీష్ మీడియం నందు ప్రవేశం కోసం షెడ్యూల్ తెగల వారు ఎస్టీకి 5, ఇతర షెడ్యూల్ తెగల వారికి 10 మొత్తం ఆరు సీట్లు బాలురు, బాలికలకు దరఖాస్తులు కోరుతున్నట్లు ఇన్‌చార్జ్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారిణి జి.రజిత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు ఫారం జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయం రూమ్ నెంబర్ 208 నుంచి ఉచితంగా పొందవచ్చన్నారు. దరఖాస్తు చేయు బాల, బాలికలకు తేదీ 01.06.2017 నుంచి 31.05.2018 లోపల జన్మించి ఉండాలన్నారు. ఐదు సంవత్సరాల నుంచి ఆరు సంవత్సరాలలోపు ఉండాలని సూచించారు. తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం రూ.1.50 లక్షలు గ్రామీణ ప్రాంతాల్లో, రూ.2 లక్షలు పట్టణ ప్రాంతాల్లో మించి ఉండరాదని చెప్పారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, నివాస ధ్రువీకరణ, కుల ధ్రువీకరణ పత్రాలు తహసీల్దార్ గారిచే మీసేవ సర్టిఫికెట్లు జారీ చేసినవి, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో జతపరచాలని చెప్పారు. పూర్తి చేసిన ఫారాలను ఈ నెల 11 తేది సాయంత్రం 5 గంటలకు తమ కార్యాలయంలో అందించాలని పేర్కొన్నారు.



పాఠశాలలోని సౌకర్యాలపై ఆరా తీస్తున్న న్యాయాధికారి

కస్తూర్బా పాఠశాలల పరిశీలన

కామారెడ్డి టౌన్, మార్చి 2: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సేవాధికార సంస్థ కార్యదర్శి న్యాయాధికారి టి.నాగరాణి శనివారం టెక్రియాల్ కస్తూర్బా బాలికల పాఠశాలను పరిశీలించారు. ఆహార ధాన్యాలు, వంట సరుకులు నాసిరకం వాడుతున్నారని గుర్తించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రాంగణం అపరిశుభ్రంగా ఉండకుండా చూడాలని ప్రిన్సిపాల్ లావణ్యకు సూచించారు. విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాల వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు.

హనుమాన్ ఆలయాల్లో భక్తుల పూజలు

బాన్సువాడ టౌన్, మార్చి 2: పట్టణంలోని పెద్ద హనుమాన్ మందిరం, గౌలిగూడ, పాత బాన్సువాడ, శ్రీరామ మందిరాల్లో శనివారం భక్తులు ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయ అర్చకులు స్వామి వారికి సుప్రభాత సేవ, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సింధూరంతో స్వామిని అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని ఆంజనేయస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.


విద్యార్థులకు ప్యాడ్‌లను పంపిణీ చేస్తున్న ఎస్ఐ

పరీక్షలంటే భయాన్ని వీడాలి

బీబీపేట, మార్చి 2: మండలంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలోని పదో తరగతి 45 మంది విద్యార్థులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీబీపేట ఎస్ఐ ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలంటే భయాన్ని వీడి ఏకాగ్రత, శ్రద్ధతో చదివితే మంచి మార్కులు వచ్చి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు పడుతాయని అన్నారు. లక్ష్యం సాధన దిశగా ఎల్లప్పుడు ప్రయత్నం చేసి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ అంకన్నగారి నాగరాజుగౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మండల చైర్మన్ బాశెట్టి నాగేశ్వర్, ప్రిన్సిపాల్ మంగమ్మ, వైస్ చైర్మన్ స్వామి, సభ్యులు వెంకట్‌రెడ్డి, బాల్‌రాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మా పైనే దాడి చేసి కేసులా..!


ప్రత్యర్థుల దాడిలో గాయపడిన భూపతి, శివ రాములు

తాడ్వాయి, మార్చి 2: ప్రత్యర్థులు మాపైనే దాడిచేసి తల పగలగొట్టారని పోలీసు స్టేషన్‌కు వెళ్తే పోలీసులు మాపైనే కేసులు నమోదు చేసి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధితులు భూపతి, శివరాములు తెలిపారు. మండలంలోని చిట్యాల గ్రామంలో గత పది రోజుల క్రితం పంట చేనులోని ఒడ్డు విషయంలో ఇరువురి మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో గ్రామానికి చెందిన శంబల భూపతిపై ప్రత్యర్థుల దాడి చేసి బండరాయితో తలపై గట్టిగా బాదారు. దీంతో భూపతికి తల పగిలింది. భూపతి మామ శివరాములుకు దెబ్బలు తగిలాయి. ఈ విషయమై భూపతి, శివ రాములు తాడ్వాయి పోలీసుస్టేషన్‌కు వెళ్లి గ్రామానికి చెందిన శంబల మైపాల్, భాస్కర్, రాజయ్య, రవీందర్‌లు తమపై దాడిచేసి గాయపరిచారని దీంతో పోలీసుస్టేషన్‌లో నలుగురిపై కేసులు నమోదు చేశారని తెలిపారు. అనంతరం దాడి జరిగిన 8 రోజుల తర్వాత తిరిగి తమపై ఎస్ఐ కేసు నమోదు చేసి వేధిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. న్యాయం చేయాల్సిన పోలీసులే అన్యాయం చేస్తే ఎలా అనివారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఐ కేసు వద్దు మాట్లాడుకోమని వేధిస్తున్నాడని తెలిపారు. ఈ విషయమై తాము ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

థియేటర్	సినిమా
దర్శన్	హనుమాన్
శాంతి	ఊరు పేరు భైరవకోన
ప్రియా 70	ఈగల్
ప్రియా 35	ఆపరేషన్ వాలెంటైన్

బాన్సువాడ

థియేటర్	సినిమా
మహేశ్వరి	గుడాచారి 111
వెంకటేశ్వర	ఆపరేషన్ వాలెంటైన్

చికెన్ ధరలు

రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210